

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 10, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 9066.66 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.014 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి50, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం100.037మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నెల్లూరు జిల్లా కలెక్టర్ శుక్లను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు

### ఫైల్స్ క్లియరెన్స్ లో నెల్లూరు జిల్లాకు రెండోస్థానం



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫైళ్లను వేగంగా పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల రెండోస్థానంలో నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్లను త్వరగా పరిష్కరించడంలో కలెక్టర్ల పనితీరుకు సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం ర్యాంకులు ప్రకటించారు. సెప్టెంబర్ 9 నుంచి డిసెంబర్ 9 వరకు మూడు నెలల్లో ఈఫైల్స్ క్లియరింగ్ లో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మొదటి స్థానంలో ఉండగా, నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ద్వితీయ స్థానంలో, విజయనగరం జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లాలో గడిచిన మూడు నెలల్లో వివిధ శాఖల నుంచి 682 ఫైల్స్ రాగా 628 ఫైళ్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల క్లియర్ చేశారు. సీఎం కలెక్టర్ హిమాన్షు శుక్లను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం సూచించారు.

## కలెక్టర్‌చే అమృత ఆరోగ్య కార్డులు పంపిణీ

- 3255 చికిత్సలు,శస్త్ర చికిత్సలు సహా ఏటా రూ. 25 లక్షలు వరకు ఉచిత వైద్యం
- లబ్ధిదారులకు ఆరోగ్య కార్డులు, పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవాలో భాగంగా అనాధలు, నిరాశ్రయులు, సీనియర్ సిటిజన్ల కోసం అమలు చేస్తున్న అమృత ఆరోగ్య పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత విస్తరించనుంది. జిల్లాలో రెండో విడతలో 59 మందికి ఈ పథకం వర్తింపజేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ మేరకు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల లబ్ధిదారులకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఎన్ వీ సుధీర్ కుమార్‌కు సూచించారు. మొదటి విడత జిల్లాలో 518 మంది ఈ పథకం పరిధిలో ఉన్నారు. గుర్తించిన వారందరికీ ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో అనుసంధానించబడిన హాస్పిటల్స్ ద్వారా ఉచితంగా చికిత్సలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 3255 చికిత్సలు/శస్త్ర చికిత్సలు సహా ఏటా రూ 25 లక్షలు వరకు ఉచిత వైద్యం అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవా జిల్లా సమన్వయ కర్త డాక్టర్ ఎన్‌వి సుధీర్ కుమార్, ఐసిడిఎస్ పిడి హేమా సుజన తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కమీషనర్



**నెల్లూరు కార్పోరేషన్,డిసెంబర్ 10 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమీషనర్ వై.ఓ.నందన్ స్థానిక సిరి సినిమా హాల్ సమీపంలోని నూతనంగా నిర్మిసుతన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ఇతర నిర్మాణ, మరుగుదొడ్ల పనులను కమీషనర్ పరిశీలించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానిక ఎస్2 సినిమా హాల్ సమీపంలో డ్రైను కాలువల నిర్వహణ తీరును పరిశీలించారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలోని పంపింగ్ హౌస్ తనిఖీ చేసి పనితీరును పరిశీలించారు. ఈకార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాహంతుజానీ, సిబ్బందిపాల్గొన్నారు.

## ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసిన కావలి ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి నెల్లూరు పట్టణానికి విచ్చేసిన సందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేయడం జరిగింది. వీరితో జిల్లా ఎస్‌పిఅజిత వేజెండ్లకూడా కలరు.

## పారిశుద్ధ్య సిబ్బందితో వారాంతపు సమీక్ష : కమీషనర్





**నెల్లూరు కార్పోరేషన్,డిసెంబర్ 10 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ కమీషనర్ వై.ఓ.నందన్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో బాగంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయంకు చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్ళను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేసుకొన్న కమర్షియల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి అంగడిని ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. సచివాలయ పరిధిలోని ప్రతి రోడ్డులో వైర్లు, చెత్తగుట్టలు, మట్టి, చెత్తకుప్పలు ఎటువంటి ఉపయోగంలో లేని పరికరాల లేకుండా రోడ్లు శుభ్రంగా ఉండునట్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ అనుగుణంగా నడుచుకొని వ్యాపారస్తులకు ఫైన్ విధించాలని సూచించారు. డోర్‌టుడోర్ తిరిగి చెత్తను సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ అధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, టిపిఆర్‌ఓ వాసుబాబు, మలేరియా విభాగం డాక్టర్ జిజియా, శ్యానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాలకొండరెడ్డిని సత్కరించిన డాక్టర్ నాయుడు



**కావలి, డిసెంబర్ 10, ప్రభాతవార్త** పీఎంపీ కావలి డివిజన్ గౌరవ సలహాదారు, న్యాయ సలహా కమిటీ సభ్యులు, సమాజ సేవకులు ఎం. మాలకొండా రెడ్డి జన్మదినోత్సవం బుధవారం కావలి పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ నాయుడు మాలకొండా రెడ్డికి స్వీట్లు తినిపించి దుశ్శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అధ్యక్షుడు పిడుగు వెంకట రమణయ్య, డాక్టర్ ప్రభాకర్ నాయుడు, ప్రజా వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

### - జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** రైతాంగ సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శాన్వాస్ గంగపట్నం రమణయ్య లు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కొనిసిన భారీ వర్షాలు తుఫానుల వలన రైతు జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ముఖ్యంగా తుఫాన్ కారణంగా 14000 ఎకరాలలో నారుమండ్లు 1,50,000 ఎకరాలలో వరి నాట్లు దెబ్బతినగా దాదాపు 200 ఎకరాలలో వేరుసెనగ దెబ్బతిన్నదని, అదేవిధంగా కండలేరు ప్రాజెక్టు పొంగి పొర్లుతూ ఉండడంతో ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి మళ్లీ నార్లు పోసుకోవటానికి విత్తనాలు కూడా అందుబాటులో లేవని జిల్లా రైతాంగానికి అవసరమైన మేరకు విత్తనాలు యూరియా సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ను వారు డిమాండ్ చేశారు.ధాన్యం పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి కొనుగోలుచేయాలని, భూమిలేని కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయుట గురించి ఖరీఫ్ సీజన్ లో 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తామని, అందుకు గాను 6 కొట్ల 70లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచుతామని చెప్పిఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తుంది. కనీసం గోనె సంచులను రైతాంగానికి అందించడంలో విఫలమవుతుంది. తేమ శాతం పేరుతోనూ, ధాన్యం రంగు మారిందని, తాలు, తప్పలు ఉన్నాయని ధాన్యం కొనుగోలు చేయకుండా అనేక కొర్రీలు పెడుతున్నారు. కనీసం పంటను ఆరబెట్టుకోవడానికి, తడవకుండా కాపాడుకోవడానికి పట్టాలు కూడా ఇవ్వడం లేదు. కొనుగోలు కేంద్రం, రైతు సేవ కేంద్రం, రవాణా ఇన్ చార్జిలు, కస్టోడియన్ ఆఫీసర్లు రైస్ మిల్లర్స్ కుమ్మక్కై ధాన్యం దళారులకు అమ్ముకునే విధంగా వ్యవహరిస్తున్నరన్నారు. దీంతో 75 కేజీల బస్తాను రూ.1200 అమ్ముకొని బస్తాకు రూ. 400 నుంచి 500 వరకు నష్టపోతున్నారు. రైతు ప్రయోజనాలకు నష్టం చేసే విధంగా సీడ్ బిల్లు, విద్యుత్తు బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి పోతున్నాయి. అని అన్నారు. ఆ బిల్లులను పూర్తిగా రైతాంగం వ్యతిరేకిస్తుందని వారు తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి జిల్లా సమస్యలపై వివరించగా దీనిపైన స్పందించిన జిల్లా కలెక్టర్ రైతాంగ సమస్యలపై ఎంతో సానుకూలంగా ఉన్నారని జిల్లాలో దెబ్బతిన్న రైతాంగానికి విత్తనాలను 80 సబ్సిడీతో ఇచ్చేందుకు ఇప్పుడే రంగం సిద్ధం చేశామని అలాగే అవసరమైన మేరకు రైతులకు యూరియాను అందించేందుకు సిద్ధంగా ఉన్నదని రైతులెవ్వరు ఈ విషయంలో ఆందోళన చెందవలసిన అవసరం లేదని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సిపిఐ సీనియర్ నాయకులు వి రామ రాజు జిల్లా కార్యవర్గ సభ్యులు కే వినోదమ్మ, సిరాజ్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కీలకుప్పం రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దమ్ము దర్గాబాబు సర్వేపల్లి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఏడుకొండలు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ సిపిఐ నెల్లూరు రూరల్ మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ, మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వనజ, విద్యార్థి సంఘం నగర కార్యదర్శి శివం, చేనేత కార్మిక సంఘం నాయకులు గ్రామ ఉప సర్పంచి సల్లా నరసయ్యలతో పాటు పలువురు రైతులు యువజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## "సేవ్ కలువాయి" నిరసన కారులకు పలు సంఘాల మద్దతు

### - రోజురోజుకి ఉధృతమౌతున్న ఉద్యమం






**కలువాయి, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** సేవ్ కలువాయి నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలాన్ని కొనసాగించాలంటు అదే విధంగా ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోనే కలువాయిని ఉంచాలంటు కలువాయి ప్రజలు జెఏసి నాయకుల ఆద్వర్యంలో బుధవారం 2వ రోజు రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. "సేవ్ కలువాయి" అనే నినాదంతో బస్టాండ్ కూడలి నందు నిర్వహిస్తున్న ఈకార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బిజెపి పార్టీ సమన్వయకర్త ఎస్ఎస్ఆర్ నాయుడు, శ్రీసరస్వతీ విద్యానికేతన్ విద్యార్దులు సిబ్బంది,సిఐటియు అనుబంధ సంఘాలు పలు వర్గాల వారు మద్దతు పలుకుతు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుండి ప్రజలకు ప్రయోజకరమైన విషయాన్ని తెలియజేసే వరకు మండల ప్రజలు చేపట్టిన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా నిరసన కారులు తెలిపారు.

## మహిళా సంరక్షణ కార్యదర్శుల బాధ్యతలు ముఖ్యం

- గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి
- మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఐజి వీడియో కాన్ఫరెన్స్



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయ గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా యస్‌పి డా. అజిత వేజెండ్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో సైతం సమస్యలను తెలుసుకోవడానికి పోలీసు డిపార్టుమెంటుకు ప్రజలకు మధ్య వారధి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి లేనని పేర్కొన్నారు. ఆయా పరిధిలో పోలీసులకు సంబంధించిన స్థానిక సమస్యల గురించి, అవసరమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు, గంజా సేవించేవారు, అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా, అసాంఘీక కార్యకలాపాలు తదితర విషయాలను తెలిపాలని సూచించారు. కాలేజీలు, స్కూలు విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాల గురించి ప్రొఫెసర్స్ కానీ, స్థానిక కౌన్సిలర్స్ ద్వారా కానీ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మిస్సింగ్ కేసులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూన, ఈవ్ టీజింగ్ ప్రత్యేక దృష్టి సారించాలని ఐజి ఆదేశించారు. అదేవిధంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళా చట్టాల పట్ల, శక్తి యాప్, సోషల్ మీడియాలపై, ప్రజలకు సఖి కౌన్సెలింగ్ కేంద్రం, ఓపెన్ డ్రింకింగ్, పోక్సో కేసులు నివారణ చర్యలను వివరించాలని తెలిపారు. మహిళల భద్రతకు చేయాల్సిన కృషి, తీసుకోవాల్సిన చర్యలు గురించి వారికి పిపిటి ద్వారా దిశానిర్దేశం చేశారు. మహిళలు, బాలలు, వృద్దులపై నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలతో అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాగా పని చేసి వారిని గుర్తించి ఆయా వివరాలను వారి సర్వీస్ బుక్ నందు నమోదు చేస్తామని, వారి సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కాన్ఫరెన్స్ నందు అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

### గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని నేరాల నియంత్రణపై టాస్క్ ఫోర్స్ బృందం ప్రత్యేక దృష్టి పెట్టాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి జిల్లాలోని స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయుటకు ప్రతి బృందానికి ఒక ఎస్పై స్థాయి అధికారి ఇంచార్జ్‌గా ఉంటూ 6 స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లా పోలీసు వ్యవస్థను మరింత చురుకుగా, సమయస్ఫూర్తితో, సమన్వయంతో ముందుకు తీసుకెళ్ళాలని అయన కోరారు. ప్రతి బృందం నిర్దిష్ట ప్రాంతాల్లో, నిర్దిష్ట నేర రకాలపై ఫోకస్ పెట్టి పనిచేయాలని స్పష్టం చేశారు. నేరాలు జరుగుటకు అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ సడెన్ రైడ్స్ నిర్వహించాలని సూచించారు.రాత్రిపూట పహారా, పాయింట్ చెకింగ్, మొబైల్ పార్టీల గస్తీ పెంచాలని సూచించారు. గాంజా అమ్మకం, వినియోగం, రవాణాపై జిల్లా వ్యాప్తంగా అత్యంత కఠిన చర్యలు చేపట్టాలని ఐజి ఆదేశించారు. వీకెండ్స్, ఫెస్టివల్ డేస్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ప్రమాదాలను ముందస్తుగా అరికట్టాలన్నారు. క్రిమినల్స్ ఉన్న ప్రదేశాలు, అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ల పద్ధతి ప్రకారం నిర్వహించాలని, అక్రమ కార్యకలాపాలకు వేదికగా ఉపయోగిస్తున్న లాడ్జీలు, లాడ్జ్ బుకింగ్ రికార్డ్స్ పై తనిఖీలు చేయాలన్నారు. ఫీల్డ్‌లో ఉన్న స్టాఫ్ ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండేలా సూచించారు. నేరాలను అరికట్టడమే కాకుండా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు.

## తిరుపతి వద్దు - నెల్లూరు ముద్దు

### - గూడూరు కోసం మూత పడ్డ ప్రభుత్వ ప్రవేట్ విద్యా సంస్థలు విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాస్తా రోకో





**గూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త** గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రవేట్ విద్యా సంస్థలను మూసివేసి విద్యార్థులు రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ఎన్నికల హామీ లో ఇచ్చిన విధంగా తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరును గూడూరు జిల్లాగా లేదా నెల్లూరు జిల్లాలో కలపాలని, ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో ఆందోళనలు ఉధృతం అవుతున్నాయన్నారు. టవర్ క్లాక్ సెంటర్‌లో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. అందులో భాగంగా ప్రభుత్వ, ప్రవేట్ విద్యా సంస్థలు మూత పడ్డాయన్నారు.తమ నిరసనకు స్వచ్ఛందంగా దుకాణదారులు షాపులను మూసివేశారని తెలిపారు. విద్యార్థి యువజన జేఏసీ ఆధ్వర్యంలో సాదుపేట సెంటర్‌లో రోడ్డు పై బైఠాయించి రాస్తా రోకో చేపట్టడం జరిగిందన్నారు. దీంతో సుమారు గంటకు పైగా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు, ప్రాణాలైనా అర్పిస్తాం అంటూ నినాదాలు చేశారు. గూడూరును నెల్లూరులో కలిపే వరకు ఆందోళనలు ఉధృతం చేయడం జరుగుతుందని విద్యార్థి సంఘం నాయకులు హెచ్చరించారు.కాగా గూడూరును జిల్లా కేంద్రం చేయాలి లేదా నెల్లూరు జిల్లాలో కలపాలంటూ విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైందన్నారు. అన్నీ ప్రవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయని తెలిపారు. గూడూరు పట్టణంలో విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ప్రవేటు పాఠశాలలు, కళాశాలలు ముందుగానే బంద్ ప్రకటించాయని, ఇక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పనిచేస్తుండడంతో విద్యార్థి సంఘాల నాయకులు వెళ్ళి విద్యార్థులను బయటకు పంపారన్నారు. పట్టణంలోని డీ.ఆర్.డబ్ల్యూ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలను మూయించారు. స్థానిక సాధుపేట సెంటర్ లో నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపు వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. నాయకులు మనోజ్, శశి, సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే పాత బస్టాండ్ సెంటర్‌లో ఇదే అంశంపై ప్రజా సంఘాలు జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాల్గవ రోజు చేరింది.

## మండలాధ్యక్షుడిని సన్మానించిన మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ

**ముత్తుకూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ జన్మదిన సందర్భంగా కృష్ణపట్నం పంచాయితీకి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షులు రాగాల శివకృష్ణ మల్లికార్జున యాదవ్‌ను పార్టీ కార్యాలయంలో బుధవారం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాగాల శివకృష్ణ మాట్లాడుతూ మండల పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలుపుకుని వారి ఆదేశాల మేరకు మండల నాయకులందరిని కలుపుకుని పోతున్నామని ఆయన తెలిపారు. అనంతరం కృష్ణపట్నం గ్రామస్తులు ఆయనను సన్మానించారు.



## రైతులకు 50 శాతం సబ్సిడీతో పురుగు మందులు జెడి సత్యవాణి



**కలువాయి డిసెంబర్ 10 ప్రభాతవార్త :** క్లస్టర్ డెమో కార్యక్రమంలో భాగంగా రైతులకు అవసరమైన పురుగు మందులు 50 శాతం సబ్సిడితో ఇవ్వడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. మండలంలోని తోపు గుంట గ్రామంలో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాంలో పాల్గొన్న సత్యవాణి మాట్లాడుతు జిల్లాలో రబీకింద 5 లక్షల ఏకరాలు సాగులో ఉండగా 35 వేల టన్నుల యూరియాను రైతులకు అందచేయడం జరిగిందని అన్నారు. త్వరలో రానున్న 5 వేల టన్నుల యూరియా విరివిగా రైతులకు యూరియా కొరత లేకుండా విరివిగా అందజేయడం జరుగుతుందని అన్నారు. రైతులు పొలం పిలుస్తొంది కార్యక్రమంలో పాల్గోని అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని అదేవిధంగా సమస్యలు తెలియజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిలు శివనా యక్, నరోసుజరావు, ఏఒలు కళారాణి, మంజుల, కలువాయి సొసైటీ అధ్య క్షులు జగదల్‌నాయుడు, టిడిపి మండల ఉపాధ్యాక్షులు జి హరిబాబునాయుడు, చంద్రమౌళి ,గడ్డం కిషో ర్‌రెడ్డి, వెంకయ్య రైతులు పాల్గోన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో హల్‌చల్ చేసిన నాగుపాము

**విడవలూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని మరుగుదొడ్డిలోకి నాగుపాము చేరి అధికారులను భయభ్రాంతులకు గురిచేసింది. ఉదయం 12గంటల సమయంలో మండల సర్వేయర్ మరుగుదొడ్లువైపు ఎవరిని వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. స్థానికులకు సమాచారం తెలపడంతో యువకులు ముందుకొచ్చి నాగు పామును చంపేశారు. ఈ కార్యాలయం పాములకు నిలయంగా మారింది. ప్రాంగణం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం లేకపోవడం కారణమని ప్రజలు చర్చలు మొదలైనాయి.



## టెన్నల్ నిర్మాణ పనులను పరిశీలించిన ఆర్‌డిఓ

**సీతారామపురం డిసెంబర్ 10 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుండి బెంగుళూరు వరకు నేర్మిస్తున్న 6లైన్ గ్రీన్‌పీల్డ్ హైవే సీతారామపురం మీదుగా వెళుతున్న విషయం తెలిసింది. అయితే సీతారామపురం నుండి పోరుమామిళ్ళ మార్గం మద్యలో ఉన్న కొండలకు టెన్నల్ పనులు జరుగుతుండగా మరొక కంపెనీ మిగిలిన టెన్నల్ నిర్మాణ పనులను చేయడానికి ప్రభుత్వ అనుమతులు కోరగా ఒ ప్రముఖ కంపెని ధరఖాస్తు చేసుకున్నదని ఆ విషయమై ఆత్మకూరు ఆర్‌డిఓ పావనీ బుధవారం టెన్నల్ నిర్మాణ పనులు చేపట్టాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారించి అన్ని శాఖల అధికారులతో చర్చలు జరిపి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసిల్దారు షేక్, ఫజిహా, డిఆర్‌ఓ ప్రసాద్, సర్వేయర్ శ్రీకాంత్, ఆర్‌ఐ సుభానీ, తదితరులు పాల్గోన్నారు.



## వైసిపి కూటమి ప్రభుత్వం అంటూ జర ముచ్చటా ప్రసంగం

**కొడవలూరు, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** మండలంలోని రేగడి చెలిక గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు ప్రచారాలు అవాస్తమని మండల నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి జర ముచ్చటగా మాట్లాడడం మండల ప్రజలకు కితకితలుగా గుసగుసలు మొదలైనాయి. ఆయన మాట్లాడుతూ ఎక్కడ కూడా తట్టెడు మట్టి ఈవైసిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనడంతో సమావేశంలో పాల్గొన్న వారికి నవ్వులు వర్షం మొదలయ్యాయి. టిడిపి కూటమి ప్రభుత్వంలో ఉటూ వైసిపి కూటమి అనడతో మరువలేని నిజాలు బయటకు వస్తున్నాయని ప్రజల్లో చర్యలు విశేషం.



## పొలిటికల్ పార్టీల నాయకులతో సమావేశం

**కావలి, డిసెంబర్ 10 ప్రభాతవార్త :** స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఎలక్ట్రాల్ రిజిస్ట్రేషన్ అధిఆరి కావలి ఆర్డీఓ సన్నీ వంశీక్రిష్ణ అధ్యక్షతన నియోజకవర్గంలోని పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఫైనల్ పబ్లికేషన్ తరువాత ఇప్పటి వరకు చేర్చిన కొత్త ఓటర్ల సంఖ్య, మరణించిన వ్యక్తుల ఓట్ల డిలీషన్ వివరాలు, కరెక్షన్ వివరాలను పార్టీల ప్రతినిధులకు తెలియజేయడం జరిగింది. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకోవడం జరిగింది. పట్టణంలోని వెంగళరావు నగర్‌లో బౌండరీలు సరిగా లేకపోవడం ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉందని తెలిపారు. ఆర్డీఓ స్పందిస్తూ వెంగళరావునగర్ ప్రాంతంలోని బౌండరీలను సరైన విధంగా సరిచేసి చర్యలు తీసుకుంటామని అలాగే ఓటర్ల గుర్తింపులో స్పష్టత కోసం సంబంధిత పోలింగ్‌స్టేషన్‌కు ఓటర్ల బదిలీ ప్రక్రియను తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నెల్లూరు రూరల్ అభివృద్ధికి పునాది

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం శాఖ మంత్రి టీజీ భరత్‌ని మర్యాదపూర్వకంగా కలిసి నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధి అంశాలను చర్చించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి. సమావేశంలో నెల్లూరు రూరల్‌కు ఎంఎస్‌ఎంఈ పార్కును మంజూరు చేసినందుకు ప్రజల తరుపున మంత్రి టీజీ భరత్‌కి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. పరిశ్రమలు రావడంతో ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఇది పెద్ద ఆశీర్వాదమని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే ఆమంచర్లలో ఉన్న 500 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌ను మంజూరు చేసిన, వేలాది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ మంత్రి భరత్ కి విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల విస్తరణతో నెల్లూరు రూరల్ భవిష్యత్తు మరింత వెలిగిపోతోందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.



## పేదలకు పెద్దఎత్తున అన్నదానం



**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం చెన్నూరురోడ్డులో సిద్వివిఘ్నేశ్వర ఆలయంలో ఇనుగూరువారి కుటుంబం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాను శ్రీరామ్ జన్మదినం పురస్కరించుకొని ఇనుగూరు బాల సుబ్రమణ్యం, శిరీషా దంపతులు, తాత సీనియర్ బిజెపి నాయకులు ఇనుగూరు బాలయ్య, పెదనాన్న శ్రీనివాసులు దంపతులు ఈకార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆలయం వద్ద పేదలకు విందు బోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ గాదంశెట్టి చెంగలరావు, దర్శి వెంకటేశ్వర్లు, కారంశెట్టి ప్రసాద్, కత్తిమహేష్, ఇనుగూరు సుబ్బారావు, తదితరులు పాల్గోన్నారు.

## ఆర్‌డీటీ కాలనీలో 50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** గతంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్‌డీటీ కాలనీ అభివృద్ధికి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. పెంచలయ్య ఉత్తరక్రియల రోజే డ్రెయిన్లు, కల్వర్టు నిర్మాణాలకు సీపీఎం నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఆయన తెలిపారు. పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంగా వారి బాధలో సీపీఎంతో కలిసి తమ అండ అన్ని విధాలా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గంజాయి మూకల వల్ల నిరపరాధులపై జరుగుతున్న దాడులు ఇక భరించబోమని, ఇటువంటి అసాంఘిక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగాం గంజాయికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంబించిన ఉద్యమం మరింత ఉద్భతం అవుతుందని, పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ వర్గాలను కలుపుకుని పోరాటాన్ని బలోపేతం చేస్తామని శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నేత, మాజీ డిపూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులు, బీజేపీ నాయకులు యరబోలు రాజేష్, జనసేన నాయకులు గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## నెల్లూరు రూరల్ అభివృద్ధికి భారీ బాటలు

**– ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి నిర్ణయాలకు గిరిధర్‌రెడ్డి కృతజ్ఞతలు**

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆర్‌అండ్‌బి రోడ్లు, పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జికు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రాష్ట్ర ఆర్ అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ ప్రజల తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రూరల్ ప్రాంత ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న ప్రధాన రహదారి పనులు, కలుజుపై బ్రిడ్జి మంజూరు కావడం ప్రాంత అభివృద్ధికి నూతన దిశను తీసుకురాబోతోందని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ ప్రజలు ప్రయాణిస్తున్న ప్రతి రోజు ఎదురయ్యే ఇబ్బందులను ప్రభుత్వం సీనియస్‌గా పరిగణించడంతో ఈ నిర్ణయాలు వెలువడ్డాయని తెలిపారు. రాబోయే రోజుల్లో రోడ్ల నిర్మాణం, బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి చేయబడేలా అనుసంధానం కొనసాగిస్తామని గిరిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. రూరల్ ప్రజల జీవిత ప్రమాణాలను మెరుగుపరిచే ఈ మంజూరు ప్రాంత అభివృద్ధికి పెద్ద ఊతమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## నెల్లూరు రూరల్‌లో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌కు నిధులు కోరిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** అమరావతిలో శాసనమండలి సభ్యులు బీద రవిచంద్రతో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో బడుగు బలహీన విద్యార్థులకు ఎంతో అవసరమైన డాక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవనం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన నేపథ్యంలో భవనం పూర్తి చేయడానికి తక్షణం నిధులు మంజూరు చేయాల్సిందిగా మంత్రిని గిరిధర్‌రెడ్డి అభ్యర్థించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ స్టడీ సర్కిల్ నిర్మాణం త్వరితగతిన పూర్తయితే శిక్షణా సదుపాయాలు విస్తృతంగా లభిస్తాయని గిరిధర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



## డొంక రోడ్ల మంజూరుకు కృషి

**– వ్యవసాయ మంత్రిని కలిసిన టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెంన్నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కీలక అంశాలను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వినిపించారు. గ్రామాల నుంచి పొలాలకు సాఫీగా వెళ్లేందుకు రైతులకు పెద్ద అడ్డంకిగా మారుతున్న రహదారి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన గిరిధర్‌రెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ ద్వారా డొంక రోడ్లను అత్యవసరంగా మంజూరు చేయలని కోరారు. రైతుల మరింత సౌలభ్యం కోసం ఈ రహదారులు అత్యంత అవసరమని, వెంటనే చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.



## బీడీఎస్ విద్యార్ధినికి చేనేత ఉద్యోగులు వితరణ



**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** నెల్లూరులోని నారాయణ కళాశాలలో బీడీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న ఏ. చరిత చదువు కొనసాగించేందుకు ఆంధ్రప్రదేశ్ చేనేత ఉద్యోగులు ప్రొఫెషనల్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ. 75 వేల డీడీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చేనేత సంఘం సీనియర్ నాయకులు కేవీ శేషయ్య మాట్లాడుతూ ఈ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి ఈ చిరు సహాయాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ చేనేత ఉద్యోగులు, ప్రొఫెషనల్ సంక్షేమ సంఘం నాయకులకు, దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నేతలు కె. పరందామయ్య, బి. నాగభూషణం, ఊకోటి వేణుగోపాల్, కె. రాజేష్, తదితరులు ఉన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీఠ వేస్తున్న ఎమ్మెల్యే కురుగోండ్ల

**..మండలంలో 6 హెల్త్ క్లీనిక్‌లకు 1కోటి 87 లక్షల నిధులు**

**రాపూరు, డిసెంబరు10ప్రభాతవార్త :** వెంకటగిరి నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యానికి ఎమ్మెల్యే కరుగోండ్ల రామకృష్ణ పెద్ద ఫీఠ వేసి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పెంచలకోన దేవసాధనం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డిలు బుధవారం తెలిపారు. రాపూరు మండలంలో 3 కొత్త హెల్త్ క్లీనిక్‌లకు నిధులు, 3 ఆసంపూర్తి హెల్త్ క్లీన్‌కులకు నిధులు ఎమ్మెల్యే కురుగోండ్ల రామృష్ణ మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. మండలంలోని ఆకిలివలస, సిద్దవరం, శానాయపాళెం గ్రామాలలో నూతన హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణానికి ఒక్కో దానికి రూ. 36 లక్షలు, మండలంలో ఆసంపూర్తిగా వున్న సైదాదుపల్లి హెల్త్ కేంద్రానికి రూ. 30 లక్షలు, బోజ్జనపల్లి హెల్త్ క్లీనిక్‌కు రూ. 27 లక్షలు, నెల్లేపల్లి హెల్త్ క్లీనిక్‌కు రూ. 22 లక్షల చోప్పున మొత్తం ఒక కోటి 87 లక్షల నిధులను 15వ ఆర్థిక సంఘం ద్వారా అనుమతులు ఇప్పించినట్లు తెలిపారు. మండలంలో ప్రజ ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పిస్తూ 6 హెల్త్ క్లీనిక్‌లకు రూ. 1 కోటి 87 లక్షల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణకు చెన్ను సోదరులు చెన్ను తిరిపాల్ రెడ్డి, చెన్ను అశోక్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ

**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త :** యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొన్న వెళ్ళగానే ఆమె వెంటనే స్పందించారని వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ తెలిపారు. 50 టన్నుల యూరియాను వవ్వేరు బ్యాంకుకు కేటాయించరని, ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ కొనియాడారు



## గ్రంధాలయాల ద్వారా విద్యార్ధులు విజాన్ఞాన్ని పెంచుకోవాలి

**రాపూరు, డిసెంబరు10ప్రభాతవార్త :** విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంధాలయాలకు వచ్చి అక్కడ వున్న పుస్తకాలను, గ్రంధాలను చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాపూరు గ్రంధాలయాధికారి అంజయ్య కోరారు. బుదవారం రాపూరులోని గ్రంధాలయంలో ఆయన గ్రంధాలయాల యొక్క అవశ్యకతను స్థానిక గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజు దినపత్రికలు చదవడం ద్వారా ప్రపంచంలో ఎమి జరుగుతుందో, ఎటువంటి నూతన అవిష్కరణలు జరుగుతున్నాయో తెలుసుకోవచ్చాని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు, గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గోన్నారు.



## మెడికల్ కాలేజీల ప్రవేటీకరణతో పేదలకు అన్యాయం





**ఆత్మకూరు ,డిసెంబరు10ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేసి తమకనుకూలమైన వారికి పిపిపి విధానంలో కట్టబెట్టి ప్రజలను దగా చేసేందుకు సిద్ధమవుతున్నారని వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో అందరం కలిసి దాన్ని అడ్డుకుందామని ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్వహించిన కోటి సంతకాలసేకరణ ప్రతులను జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, కూనం సుధాకర్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆ రాష్ట్ర బాధ్యుడు పూనూరు రాంమనోహర్‌రెడ్డి , ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్‌రెడ్డి , మండలాల కన్వీనర్లు బిజివేముల పిచ్చిరెడ్డి, చెన్ను వెంకటేశ్వర్లురెడ్డి, పులగం శంకర్‌రెడ్డి ,నియోజకవర్గ వైసిపి పంచాయతీరాజ్‌సెల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుఆమర్ రెడ్డి తో కలిసి బుధవారం జిల్లా కేంద్రమైన నెల్లూరుకు తరలించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావ్ మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణలో ప్రభుత్వంపై ప్రజలకు ఉన్నవ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని, ప్రజల సహకారంతోనే నియోజకవర్గంలో 60వేలకు పైగా సంతకాల సేకరణ జరిగిందన్నారు. పేదలకు వైద్యవిద్య, వైద్యం దూరం చేసేలా కూటమి పాలనలో ప్రవేటీకరణ జిఒను ప్రవేశాఎట్టడం దారుణమన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 17వైద్య కళాశాలలు మంజూరు చేయించి అందులో 7కళాశాలలు పూర్తిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థలను నాశనం చేశారన్నారు. పిహెచ్‌సిలకు ఇద్దరు డాక్టర్ల ఏర్పాటు జగనన్న ఆలోచనల మేరకే జరిగిందన్నారు. ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతతో ప్రభుత్వం ఇప్పటికైనా ప్రవేటీకరణ ఆలోచనను మానుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సేకరించిన ప్రతులను 15వ తేదీ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేర్చనున్నట్లు ఆకార్యక్రమానికి అధికసంఖ్యలో పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి సంతకాల సేకరణ ప్రతులను నెల్లూరుపార్టీ కార్యాలయానికి తరలించే వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. ప్రతులను తీసుకెళ్ళే ప్రత్యేక వాహనం ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్టీసి డిపో వరకు ర్యాలీగా సాగారు.

## వైకాపా కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

- మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటాం
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి



**నెల్లూరు, డిసెంబరు10 ప్రభాతవార్త విద్య :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణకు ప్రజలనుండి విశేష స్పందన లభించిందని, నెల్లూరు నగర నియోజకవర్గంలో దీనిని అందరికంటే ముందగా పూర్తిచేయటం మిక్కిలి సంతోషంగా ఉందని వైకాపా నగర ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు నగరంలో పూర్తి అయిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాంలో సేకరించిన సంతకాల వాహనాన్ని నగరంలోని స్థానిక వైకాపా నగర కార్యాలయంలో జెండా ఊపి జిల్లా కార్యాయానికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు నెల్లూరు నగర నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ ఓ ఉద్యమంలా సాగిందన్నారు. సుమారు 73వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా తమకు సహకరించి సంతకాలు చేసి కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఉప సంహ రించుకోవాలని కోరటం జరిగిందన్నారు. నగరంలోని అన్నీ డివిజన్స్‌లో ప్రజలు తమకు సహకరి ంచారన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విసిగిపోయిన ప్రజలు ఈ ఉద్యమాన్ని స్వచ్ఛందంగా నడిపించటం జరిగిందన్నారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తాము రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాలను డిజిటలైజేషన్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 20 లక్షల మంది ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు లోపించాయని, హత్యలు, గంజాయి, డ్రగ్స్ దందా సాగుతుందన్నారు. ప్రశ్నిం చిన వారిపై దాడులు జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నార నిదుయ్య బట్టారు. ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రార్టీ శ్రేణులకు, ప్రజలకు ఆయన ధన్యవా దాలు తెలిపారు. అనంతరం నగర పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నగర కార్పోరేటర్లు, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఐజి





**నెల్లూరు క్రైమ్ డిసెంబర్ 10 ప్రభాతవార్త :** నగరంలోని నవాబ్ పేట, సంతపేట, బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్లను గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠి, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి బుధవారం సందర్శించారు. పోలీసు స్టేషన్ ల మ్యాప్ లను పరిశీలిస్తూ, స్టేషన్స్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఈ సందర్భంగా ఐజి ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న పెండింగ్ కేసులు, క్రైమ్ రికార్డుల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. జిల్లాను పూర్తిగా నేరరహితంగా, ప్రజలు యథావిధిగా ప్రశాంతంగా జీవించగల వాతావరణం ఉండుటకు తగిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. యాక్టివ్ రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. క్రైమ్ ప్రోన్ ప్రాంతాలలో నిరంతర నిఘా, ప్రత్యేక బృందాల పర్యవేక్షణ కొనసాగుతుందని, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, క్రిమినల్ కార్యకలాపాల నుంచి దూరంగా ఉండేలా మార్గనిర్దేశనం చేయాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు. పునరావృత నేరాలు చేసే రౌడీలు, గ్యాంగ్ సభ్యులపై పీడీ యాక్ట్ వర్తింపజేస్తామని, నేరాలకు పాల్పడిన వారి ఆస్తులను కూడా సీజ్ చేసే విధంగా దర్యాప్తు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజల మధ్య రోడ్లపై నడిపిస్తూ నేరగాళ్ళ ప్రవర్తనను అరికట్టే దిశగా తగిన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, నేరాల విచారణలో పారదర్శకత, రెస్పాన్స్ టైమ్ తగ్గించడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్ లను గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులతో పాటు పట్టణ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి, వెంటనే పరిష్కరించేలా జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో సంబంధిత డీఎస్పీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

**దగదర్తి, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు అయిన సంఘటన అనంతవరం లయన్స్ నగర్ ఫ్లై ఓవర్ దగ్గర చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. ఉలవపాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు అనంతరం లయన్స్ నగర్ ఫ్లై ఓవదర్ దగ్గర ద్విచక్ర వాహనదారులు గేదెను ఢీకొని కింద పడ్డారు. వీరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపని కుమార్ తెలియజేశారు.

## వరి నారుమడులు పరిశీలించిన శాస్త్రవేత్తలు



**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని నాగమాం బాపురం, ఇసుకపాళెం, గ్రామాలల్లో జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు వరి ,నాడుమడులు, దెబ్బ తిన్న వరి పొలాలను ఏడిఏ మారుతిదేవి,ఏవో రామ్మోహన్,లోకేష్, సందర్శించడం జరిగింది. పెనుబల్లి రైతు సేవా కేంద్రంలో కెఎన్ఎం 1638 వరి విత్తనాలు 100 బస్తాలు అందు బాటులో ఉన్నాయని వరి నారుమడులు దెబ్బతిన్న రైతులు రైతు సేవా కేంద్రాల పరిధిలో సంప్రదించాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

## టీకాలు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి



**కావలి, డిసెంబర్10 ప్రభాతవార్త :** టీకాలు అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిమ తెలియజేశారు. కావలి రూరల్ మండలం, చెన్నాయిపాలెం పాములుగుంట పాలంలోని ప్రాథమిక పాఠశాలలో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా బాలలకు, గుర్భవతులకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన సర్వాయిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో బుధవారం వైద్యశిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పి.ప్రతిమ మాట్లాడారు. బాలలకు, బాలింతలకు వేసే టీకాలు అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని, రోగ నిరోధక, వ్యవస్థను బలోపేతం చేసి, దనుర్వాతం, కోరింత దగ్గు, పోలియో, మీజిల్స్ గవదబిల్లల, రుబెల్లా తట్టు, న్యూమెనియో వంటి అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మెన్ దొడ్ల మనోహర్‌రెడ్డి కూసం తాతిరెడ్డి, ఎఎన్ఎంలు విజయమ్మ, పరిమళ, ఎంసిహెచ్ పి సమత ఇన్సూలెట్ ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐఓబీ లో సర్వర్ పని చేయక ఇక్కట్లు



**బిట్రగుంట డిసెంబర్ 10 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన బోగోలు లో గత రెండు రోజుల నుండి ఇండియన్ ఓవర్సిస్ బ్యాంకు లో సర్వర్లు పనిచేయక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్ధిక లావాదేవీలు జరగక ఆర్ధిక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతఅధికారులు స్పందించి సర్వర్ లలో ఏర్పడిన సాంకేతిక సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమైంది



**కావలి, డిసెంబర్10 ప్రభాతవార్త :** పురపాలక సంఘంలో వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమైనదని వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకొని ఆచరిస్తే చెత్త నుండి సంపద పొంద వచ్చునని మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్ తెలి పారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ వారి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పురపాలక సంఘంలోని మెప్మా ఆర్పీలకు సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగి ంది. ఈ కార్యక్రమానికి కమీషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛకావలిగా తీర్చిది ద్దాల ంటే అందరూ చెత్తను వేరేచేసి మున్సిపల్ సిబ్బంది వచ్చినపుడు వారికి అందించాలని తదెలిపారు. అందరూ బాధ్యతగా వహిస్తే కావలి స్వచ్చాంధ్రగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. మున్సిపల్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటిస్తూ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ ఆర్. రమా దేవి, వై.జయమధురిమ, వి.తిరుపతిరావు పాల్గొని శిక్షణ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం భారతి, సిఓలు, ఆల్‌ఇండియా ఇన్‌స్ట్యూట్ ఆఫ్ లోకల్‌సెల్ఫ్ గవర్నమెంటు సిబ్బంది పాల్గొన్నారు.

## కౌశల్ క్విజ్ విజేతలకు అభినందనలు



**ముత్తుకూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రహ్మదేవంలో చదువుతున్న 8వ తరగతికి చెందిన చిలకపాటి నిహారిక, 9వ తరగతి చెందిన మన్నేపల్లి చందన్ పవన్ విద్యార్థులు నవంబర్ 28వ తేదీ జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ క్విజ్ ఆన్లైన్ కాంపిటీషన్లో విజేతలుగా నిలిచారు. డిసెంబర్ 27వ తేదీ తిరుపతిలో జరగబోవు కౌశల్ రాష్ట్ర స్థాయి క్విజ్ పోట ీలకు ఎంపిక అయిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టాన్యా విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి బ్రహ్మదేవం విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉన్నదని, తిరుపతిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రథమ స్థానంలో నిలవాలని ప్రోత్ సహించారు. ఈ విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన గైడ్ టీచర్ ఫణికుమార్‌ను, ఉపాధ్యాయులు షాయినా పర్వీన్, మహేష్ రెడ్డి, తిరుపాలు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరిని అభిన ందించారు.

## సబ్సిడీ విత్తనాలు వినియోగించుకోవాలి



**పొదలకూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** తుఫాన్ల కారణంగా నష్టపోయిన రైతులు సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని పి. సత్యవాణి అన్నారు బుధవారం మండల పరిధిలోని మరుపూరు గ్రామంలో జిల్లా దిత్వా తుఫానుకు దెబ్బ తిన్న నారుమడి రైతులకు 80 సబ్సిడీ పై వరి విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ 25 కేజీల వరి విత్తనాల పూర్తి ఖరీదు రూ. 1070 కాగా ప్రభుత్వం సబ్సిడీ రూ. 855 రైతు వాటా కేవలం రూ. 215 మాత్రమేనన్నారు. మండలంలో వరి పంట నష్టపోయిన రైతులు విత్తనాల కోసం వారి ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకంతో మీ దగ్గరలోని రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంపాదించాలన్నారు. అనంతరం మరుపూరు ఛాంపియన్ రైతు శ్రీనివాసులు రెడ్డికి 100 రాయితీ పై ముడి జింక్ 10 కేజీలు, బోరాను 1 కేజీ, 1 కేజీ చిలేటెడ్ జింకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సహాయకులు కె.శివ నాయక్, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, సొసైటీ డైరెక్టర్ మల్లికార్జున యాదవ్, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, నెట్టెం పెంచలయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శివ రెడ్డి రైతులు రమణయ్య, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల కార్యాచరణ



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త:** మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో బుధవారం పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల విద్యా శాఖ అధికారి ఎస్. వేణుగోపాల్ రెడ్డి ఆధ్వ ర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యా ర్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు రూపొ ందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి మండ లానికి మంచి ఫలితాలు తీసుకురావాలని సూచించారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థుల్లో పఠన, రచన, గణిత ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన 75 రోజుల ప్రత్యేక కార్యక్రమం జీఎఫ్ఎల్ఎన్ అమలులో ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆయన కోరారు. తెలుగు, ఆంగ్లంలో చదవడం – రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై ప్రతి విద్యార్థికి బలమైన పునాది ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేలా కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. తరువాత కార్యక్రమంలో పాల్గొన్న మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ రెండు కార్యక్రమాలను విజయవంతంగా ఎలా అమలు చేయాలన్న దానిపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## 13న జవహర్ నవోదయ ప్రవేశపరిక్ష

**మర్రిపాడు, డిసెంబరు10ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారికి 13వ తేదీ శనివారం ప్రవేశ పరిక్ష జరుగుతుందని విద్యాలయ ప్రిన్స్‌పాల్ కె.పార్వతి తెలిపారు. ఈపరిక్ష శనివారం 20కేంద్రాల్లో 4174మంది విద్యార్థులు ఈపరిక్షకు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఈ పరిక్ష శనివారం ఉదయం 11.30నుండి 1.30వరకు జరుగుతుందని విద్యార్థులందరూ 10.30గంటలకు సంబంధిత కేంద్రాలకు హాల్‌టికెట్స్, ఆధార్‌కార్డులను తీసుకొని తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు. ఏదైనా సమాచారం కావాలంటే 9346022106,8985007588 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్స్‌పాల్ పార్వతి కోరారు.

## స్నేహలత ఆదరణ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే



**బిట్రగుంట డిసెంబర్ 10 ప్రభాతవార్త** బోగోలు మండల ఐటీడీపీ అధ్యక్షుడు గోచిపాతల సందీప్ తల్లిగోచిపాతల స్నేహలత ఇటీవల అనారోగ్యంతో కన్నుమూయడంతో.బుధవారం నిర్వహించిన ఆదరణ కూడిక కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా స్నేహలత చిత్రపటానికి పూలమాల అర్పించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులను పరామర్శిస్తూ వారి బాధను పంచుకున్నారు.స్నేహలత మరణం కుటుంబానికి తీరని లోటు. మీకు అవసరమైన ప్రతి విషయంలో పార్టీ, నేనూ అండగా ఉంటాం అని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.ఆయన వెంట మండల టీడీపీ కన్వీనర్ ఎం. నాగేశ్వరావు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కె. మధుబాబునాయుడు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు చిలకపాటి. వెంకటేశ్వర్లు టీడీపీ మహిళా నాయకురాలు అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు

## 12న అంగన్వాడీ ధర్నాకు సిపిఎం పిలుపు



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 12వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు తోటపల్లి గూడూరు మండలంలోని సిఐటియు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి మారుబోయిన రాజా, బండి శౌరి మాట్లాడుతూ ముత్తుకూరు, టిపిగూడూరు, ఇందుకూరుపేట మండలాలకు చెందిన అంగనవాడీ సెంటర్లను ఆ రోజు మూసివేసి అందరూ ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 4687 మినీ అంగనవాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఈ మినీ వర్కర్లకు కూడా మెయిన్ వర్కర్లతో సమాన వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్రంలో మిగిలిన 1810 మినీ సెంటర్లను కూడా క్వాలిఫికేషన్ రీలాక్సేషన్ (అర్హత సడలింపు) ఇవ్వడం ద్వారా మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. చాలా మంది మినీ వర్కర్లు పదేండ్లకు పైగా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలు అందిస్తున్నారని, అనుభవం ఉన్నందున వారిని కూడా ప్రధాన వర్కర్లుగా గుర్తించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ సమ్మె సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సహా పలువురు నాయకులు ఇచ్చిన వేతన పెంపు హామీలను వెంటనే అమలు చేయాలని, అంగనవాడీ వర్కర్లకు న్యాయం చేయాలని కోరుతూ 12వ తేదీన ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపు నిచ్చారు.

## ఆంగ్ల నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులకు శిక్షణ




**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కరడి పాథ్ విద్యా సంస్థ వారు ఎస్ఈఐఎల్ సంస్థ సామాజిక సేవా నిధుల సహాయంతో మండలంలోని 13 పాఠశాలలకు శ్రవణ – దృశ్య పరికరాలు, మాయాజాల ఆంగ్ల కార్యక్రమాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం కోసం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుండి మొత్తం 28 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు మండల విద్యా అధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాల అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కరడి పాథ్ సంస్థ జాతీయ నిర్వాహకుడు దివాకర్, సంస్థ ప్రతినిధి కరణ్, అలాగే ఎస్ఈఐఎల్ సంస్థకు చెందిన వేణు, సదాశివ రెడ్డి, ఆమనీ ఈ కార్యక్రమ ప్రయోజనాలను వివరించారు. ఈ శిక్షణతో తరగతి గదుల్లో ఆంగ్ల బోధన మరింత మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్ అహ్మద్, శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**ఇందుకూరుపేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో సిబ్బంది ఉండటం లేదనే విషయాన్ని గుర్తించి, ఎలాంటి ఇన్ఫర్మేషన్ లేకుండా హాస్పిటల్‌ను సందర్శించి ఓపీ, ఐపీ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ అన్ని రికార్డులు పరిశీలించి, డాక్టర్లు వైద్య సిబ్బంది నిర్దేశించిన వేళల్లో డ్యూటీలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తప్పవని, జగదేవి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రాత్రి వేళల్లో వచ్చిన గర్భిణీ స్త్రీలకు అత్యవసర వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో కాన్పులు ఎక్కువ జరిగేటట్లు చూడాలని, అనేక పరిశ్రమలు పీహెచ్‌సీ పరిధిలో ఉండడం వల్ల కార్మికులకు మంచిగా సేవలందించాలని, చేపలు, చెరువులు, రొయ్యల చెరువులు దగ్గర ఎక్కువ మంది కార్మికులు పని చేస్తూ ఉండటం వల్ల అలాంటి వారు కుక్క కాటు, పాముకాటుతో హాస్పిటల్‌కి వచ్చిన వెంటనే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ యాంటీ స్నేక్ వ్యాక్సిన్ వేయడంతో పాటు అత్యవసర వైద్యం చేయాలన్నారు. జగదేవిపేట ఆరోగ్య కేంద్రంలో మంచిగా సేవలందిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. డిసెంబర్ 21,22, 23వ తేదీల్లో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసేటట్లు చూడాలని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్‌లకు సూచించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిశాంత్‌రెడ్డి, ఈఐ సీనియర్ అసిస్టెంట్ రమేష్, సీసీ రామకృష్ణారెడ్డి, స్టాఫ్ నర్సు చాముండేశ్వరి పాల్గొన్నారు.

## కేవీకే నెల్లూరు ఆధ్వర్యంలో కొబ్బరిలో తెల్లదోమ నియంత్రణపై రైతులకు శిక్షణా కార్యక్రమం



**నెల్లూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త – వైద్యం :** వచ్చే శుక్రవారం అనగా 12వ తేదీన కేవీకే నెల్లూరు, కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో జగదేవిపేట కమిటీ హాల్ నందు రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త డాక్టర్ జీఎల్ శివ జ్యోతి తెలిపారు. కొబ్బరి, అరటి తోటల్లో తెల్లదోమ తీవ్ర సమస్యగా మారి దిగుబడుగు తగ్గిస్తున్న నేపథ్యంలో ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేటకు చెందిన శాస్త్రవేత్తను ఆహ్వానించి తెల్లదోమ సమగ్ర యాజమాన్యంపై వివరించనున్నాని తెలిపారు. అదే విధంగా కొబ్బరి, అరటి సాగులో అనుసరించాల్సిన ముఖ్యమైన మెలుకువల గురించి కూడా శాస్త్రవేత్తలు సూచనలు అందిం చనున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, శుక్రవారం రోజున అందరూ పాల్గొనాలని శివ జ్యోతి కోరారు. ఈ కార్యక్రమంలో రోజున అందరూ పాల్గొనాలని శివ జ్యోతి కోరారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యాన పంటల శాఖ అధికారులు పాల్గొని, రైతులు వివిధ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ నాయక్‌ను సంప్రదించండి.

## గ్రామ సభలో తీర్మానం చేసిన పనులకే ఆమోదం



**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం, గంగవరం, పాటూరు పంచాయతీల్లో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంకు సంబంధించి గ్రామ సభలను ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ సాధిక్ మాట్లాడుతూ రానున్న 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టవలసిన పనులకు గ్రామ సభలో తప్పనిసరిగా తీర్మాణం చేయాలన్నారు.కాలువ పూడికతీత పనులు, సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, ఇంకుడు గుంతలు, మాజిక్ డ్రైన్‌లు అవెన్యూ ప్లాంటేషన్ వంటి కార్యక్రమాలను గ్రామ సభలో తీర్మాణం చేస్తేనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రానున్న ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపాలెం పంచాయతీకి 41 పనులు, పాటూరు పంచాయతీ 35, గంగవరం పంచాయతీ 12 పనులకు సంబంధించి ప్రతిపాదనలు తీర్మాణం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎన్. శ్రీవాణి, లక్ష్మీకుమారి, బి. శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, విజయసేనారెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్, ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నేత రాధాకృష్ణ గౌడ్‌కు ఘన సన్మానం



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం చేపట్టిన ముక్కు రాధాకృష్ణ గౌడ్‌ను పలువురు పూర్వ ఏబీవీపీ నేతలు ప్రస్తుత ఏబీవీపీ విద్యార్థి నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఆదిత్య నగర్ రాధాకృష్ణ గౌడ్ నివాసంలో ఆయనకు శాలువాలు కప్పి సత్కరించి స్వీట్లు అందించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ తాను ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించి 16 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేశానని, వందలాది మంది విద్యార్థులను సొంత ఖర్చులతో చదివించాలని వెల్లడించారు. గత 23 సంవత్సరాలుగా బీజేపీలో చేరి అనేక బాధ్యతలు నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. బీజేపీలో సాధారణ కార్యకర్తలను కూడా జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి నేతలుగా గుర్తించి గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి దేశభక్తి జాతీయ భావాలు నైతిక విలువలు నేర్పే దిశలో పని చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నెల్లూరు విభాగ్ ప్రముఖ పరదేశి గంగాధర్ పూర్వ ఏబీవీపీ విద్యార్థి నాయకులు పోలిచర్ల ఉదయ్ కుమార్, ఎస్‌కే నాయబ్ రసూల్, అంజయ్య, కాయల మధు, పైడి చరణ్ తేజ, చిన్న, భాను కిరణ్, ఏ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## పౌష్టికాహారం సమపాళ్లలో తీసుకోవాలి



**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కౌమార దశలో ఉన్న కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా సమపాళ్లలో తీసుకోవాలని సీడీపీవో టి. శారద అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణలో బుధవారం బాల్య వివాహాలు, పౌష్టికాహారం , తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమని,ఈ దశలోనే తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమరేంద్ర , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు భవాని, అపర్ణ, మనీషా, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సు



**వింజమూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** మండల స్థాయి రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించబడుతున్నాయని కావలి ఆర్డీవో ఎం.సన్నీ వంశీ కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ముందుగా సమాచారాన్ని మంగళవారం నాడు ప్రచా మాధ్యమాల ద్వారా మండల ప్రజలకు తెలియజేశారు. రెవెన్యూ సదస్సుకు మండలంలోని పంచాయతీలో నుండి పెద్ద ఎత్తున రెవెన్యూ సమస్యలపై ప్రజలు విచ్చేశారు. మధ్యాహ్నం వరకు ఆర్డీవో తహసీల్దార్ రెండు వరుసలుగా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. దాదాపుగా ప్రజలు నుండి పలు భూ సమస్యలపై వినతులు అందజేశారు. పలు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆధార్ లింక్ చేయాలని దారి సమస్యలు ఫ్రీ హోల్డ్‌కు సంబంధించి, సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీ రిజిస్టర్ చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ నల్గొండ సృజన, టీడీపీ మండల అధ్యక్షులు గోడ నర్సారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య, ఆర్ఐలు వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి జీవితంలో పదవ తరగతి కీలకం



**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు రానున్న పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రముఖ మానసిక వికాస నిపుణులు సీహెచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ప్రస్తుతం వంద రోజులు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారని, వాటిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా పరీక్షలంటే భయం అనేది లేకుండా ప్రతి ఒక్కరూ చూసుకోవాలన్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో చదవడం వంటి కార్యక్రమాలను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలన్నారు. పరీక్షల్లో ఒకటికి రెండు పర్యాయాలు ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకుని వచ్చిన ప్రశ్నలకు ముందు కొట్టివేతలు లేకుండా రాయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా ఈ పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**– 950 మార్కులు సాధిస్తే లక్ష రూపాయలు**

రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఈ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు 950 మార్కులు సాధిస్తే వారికి లక్ష రూపాయలను పాఠశాల పూర్వ విద్యార్థి మద్దు సుధాకర్‌రెడ్డి అందజేస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకుని ఈ నగదు బహుమతులను కైవసం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సయ్యద్ జుల్ఫికర్ ఆలీ తెలిపారు. అనంతరం రమేష్‌బాబును శాలువా, బొకేతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరి, చంద్రమోహన్, శేషయ్య, కేశవర్ధిని, అరుణ, తదితరులు ఉన్నారు.

## రౌడీయిజం, భూకబ్జా , గంజాయి కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు



**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరు సర్కిల్ పరిధిలోని రెండు మండలాల్లో రౌడీయిజం, తీవ్రమైన ఆర్థిక మోసాలు, భూకబ్జా, గంజాయి సంబంధిత నేర కార్యకలాపాలకు పాల్పడితే అటువంటి వారిపై ఎన్‌డీపీఏ చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రౌడీయిజం, గంజాయి, సంబంధిత చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి అటువంటి వారిని సంవత్సరం పాటు జైలులో నిర్బంధించడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో రౌడీ షీటర్ శ్రీకాంత్ గ్యాంగ్ కార్యకలాపాలతో ఉంటూ ముద్దాయిగా ఉన్నటువంటి అంకెం రాజాను బుధవారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పీడీ యాక్ట్ కింద నమోదు చేసి జైలుకు పంపడం జరిగిందన్నారు. ఇక నుంచి ప్రజలను బెదిరించడం, దౌర్జన్యం చేయడం, చెడువాసాలకు బానిసై గ్యాంగులుగా ఏర్పడి తుంటరి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## దిత్వా తుపాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి




**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలో దిత్వా తుపాన్ వలన నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రాంగణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కార్యక్రమం నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో ఈ తుపాన్ వలన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మభ్యపెట్టడంతో వారు తీవ్రంగా అవస్థలు పడుతున్నారన్నరు. అనంతరం తహసీల్దార్ సుబ్బయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. లీలామోహన్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి. విజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, లక్ష్మయ్య, శ్రీనివాసులు, రామానాయుడు తదితరులు ఉన్నారు.

## ప్రసాద్‌నాయుడు చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

**కావలి, డిసెంబర్10 ప్రభాతవార్త :** జలదంకి మండలం గట్టుపల్లి చింతపాలెం గ్రామానికి చెందిన టిడిపి నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు ఇటీవల మృతి చెందడం జరిగింది. ఆయన ఉత్తరక్రియలు కార్యక్రమం బుధవారం వారి స్వగృహం నందు జరిగింది. ఈసందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని ప్రసాద్‌నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన



సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రసాద్‌నాయుడు మరణం టిడిపికి తీరని లోటని వారి కుటుంబానికి ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌ని సన్మానించిన బుచ్చి నేతలు

**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త** జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లుని బుచ్చిరెడ్డిపాళెం దళితనాయకులు సూదల రమణయ్య, ఉసురుపాటి ప్రసాద్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్.వి రమణయ్య మాట్లాడుతు జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు బుచ్చిరెడ్డిపాళెంలో తహసిల్దారుగా పనిచేసిన సమయంలో ఆయన మండలంలో అనేక సమస్యలు పరిష్కరించారని వారు ప్రశంసించారు.అప్పట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల



వద్దకు రైతుల్ని తీసుకొని వచ్చి వారికి గిట్టు బాటు ధర కల్పించడంలో ఆయన చేసిన కృషి అద్భుతమని అన్నారు. ఆయన ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెస్తారని వారు కొనియాడారు.

## రెడ్‌క్రాస్‌కు రూ.లక్ష విరాళం

**కావలి, డిసెంబర్10 ప్రభాతవార్త :** రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ బెజవాడ విజయల 43వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.లక్ష విరాళాన్ని తలసేమియా డేకేర్ సెంటర్ నిర్వహణ నిమిత్తం కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావుకు అందజేశారు. డాక్టర్ రవికు



మార్ మాట్లాడారు కావలి రెడ్‌క్రాస్‌లో త్వరలో క్యాన్సర్ అవగాహన నిర్ధారణ, నివారణ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు, జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ చామర్తి జనార్ధన్‌రాజు మిగతా పాలకమండలి సభ్యులు సహకరిస్తున్నారని రవి పేర్కొన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ త్వరలో ప్రారంభించే క్యాన్సర్ నిర్ధార్ణ కేంద్రానికి స్వచ్ఛంద మెడికల్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తానిని క్రటించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు పాల్గొని డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయదంపతులను ఘనంగా సత్కరించడం జరిగింది.

## అటల్, మోడీ సుపరిపాలన యాత్రను జయప్రదం చేయండి

**- 15న నెల్లూరు హరనాథపురం సెంటర్‌లో బహిరంగ సభ - శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి**

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త -వైద్యం** రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా జరుప తలపెట్టిన అటల్, మోడీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వతేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారం



భమయ్యే అటల్ మోడీ సుపరిపాలన యాత్ర, 15వ తేదీ నెల్లూరుకు చేరుకుంటుందని, పార్టీ నేతలు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 15వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక అయ్యప్ప గుడి సెంటర్ నుంచి యాత్ర ప్రారంభమై బీవీ నగర్ మీదుగా కొండాయపాలెం గేటు సర్కిల్ అన్నమయ్య, సర్కిల్ మీదుగా హరనాథపురం వరకు చేరుకుంటుందని, హరనాథపురంలో జరిగే బహిరంగ సభతో నెల్లూరు జిల్లాలో యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు వై.సత్య కుమార్ యాదవ్, ఇతర రాష్ట్ర, జాతీయ నాయకులు, కూటమి నేతలు పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అటల్ మోడీ సుపరిపాలన యాత్ర నెల్లూరు జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మునుపెన్నడూ జరగని విధంగా జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు విచ్చేసి వేలాది బైకులతో ర్యాలీ నిర్వహించాలని దీని కోసం యువత పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని గురించి గ్రామ గ్రామాన కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని అదే స్థాయిలో అన్ని వర్గాల ప్రజల నుంచి జన సమీకరణ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పనికిరాకుండా పోతున్న వివిధ వాహనాలు

**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** నెల్లూరులోని ఆర్టీవో కార్యాలయం పక్కనే ఉన్న ట్రాఫిక్ విభాగం కార్యాలయం వద్ద వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలుతుప్పుపట్టిపోతున్నాయి. ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి.ఆటోలు,కార్లు, ద్విచక్రవాహనాలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఈ వాహ



నాలపై ఉన్న కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఇలా దర్శనమిస్తున్నాయి. సంవత్సరాల తరబడి ఈ వాహనాలు ఇలానే ఉండిపోతున్నాయి.

## ఏసీ స్టేడిఎం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గోవిందయ్య ఎంపిక

**నెల్లూరు,డిసెంబరు10 ప్రభాతవార్త-విద్య** ఏసీసుబ్బారెడ్డి స్టేడిఎం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఏసీ స్టేడియం సమావేశ మందిరంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులుగా కూచి గోవిందయ్యను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కూచి గోవిందయ్య మాట్లాడుతు 2026 సంవత్సరానికి అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా తనను ఎంపిక చేయటం సంతోషంగా ఉందని, త్వరలోనే మిగిలిన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. తనపై నమ్మకంతో సభ్యులు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు.అసోసియేషన్ సభ్యులు బుర్రా వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ



అధ్యక్షులు శ్రీనివాస్ కుమార్, రంగారావు, తిరుపతి నాయుడు, బాసం శేషగిరిరావు, రామారావు, పాబోలు సత్యం, సురేష్, రమణయ్య, సురేంద్ర, బలరాం నాయుడు, మాలకొండయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

## చింతా జయప్రకాష్‌రెడ్డికి ఘన నివాళులు

**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరులోని కాపు వీధికి చెం దిన గాంధేయవాది, మానవతావాది అయిన చింతా జయప్రకాష్‌రెడ్డి ఇటీవల మృతిచెందారు.ఈ మేరకు బుధవారం జిల్లా నలుమూలల నుంచి బీజేపీ, టీడీపీ జనసేన వైసీపీ పార్టీలకు చెందిన అనేక మంది నాయకులు స్వగృహానికి వచ్చి జయప్రకాష్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నా యకులు చింతా జయప్రకాష్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని, ఆయన అనుసరిస్తున్న పలు మార్గాల గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ



సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సెజ్ కమిషనర్ డాక్టర్ తిరుపాల్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్రబీజేపీ ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్. వంశీధర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయ కులు ఆదిశేషారెడ్డి, బీజేపీ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఈశ్వరయ్య, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడ్డం విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటసుబ్బారావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులర్పించారు.

## పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లను జనవరిలోనే సమర్పించాలి

**కోవూరు, డిసెంబరు10 ప్రభాతవార్త :** కోవూరు సబ్ ట్రెజరీ పరిధిలోని పింఛన్‌దారులు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28లోగా మాత్రమే లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలని సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ కొంతమంది డిసెంబర్‌లోనే లైఫ్ సర్టిఫికెట్లను తీసుకు వస్తున్నారని, అవి పనికి రావన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జనవరిలో నెలలో లైఫ్ సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. దీని గురించి తమ కార్యాలయంలో గానీ, మీ సేవలో గానీ పింఛన్‌దారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



## స్నేహనికన్న మిన్న లోకానలేదురా

**కడదాక నీడలాగ నిను విడిపోదురా 84-85 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం**



**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త** స్నేహనికన్న మిన్న లోకానలేదురా కడదాక నీడలాగ నిను విడిపోదురా అంటు 1984-85 సంవత్సరాల పూర్వ విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొన్న పూర్వ విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనం బుచ్చిరెడ్డిపాళెంలోని పద్మావతి కళ్యాణ మండపంలో జరిగింగి. 40 సంవత్సరాల తరువాత స్నేహితులందరు ఒక్క చోట కలవడంతో అప్యాయతగా పలకరించుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. లోకం విడిచి తమ నుండి దూరమైన గురువులకు,తోటి విద్యార్థుల కోసం ఒక్క నిమిషం పాటు మౌనం వహించారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయనిలను శాలువాలు కప్పి సన్మానించారు. ఇకపై అందరు టచ్‌లో ఉండాలని కష్టసుఖాలు పంచుకోవాలని తీర్మానం చేశారు. అందరు కలిసి ఆప్యాయంగా విందు బోజనం ఏర్పాటు చేశారు.

## నగరంలో ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

**నెల్లూరు,డిసెంబరు10 ప్రభాతవార్త-విద్య** కంది నారాయణమ్మ జ్ఞాపకార్థం ఆమే కుమార్తెపి.బాగ్యరెడ్డి ఆధ్వర్యంలో బుధ వారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో 44వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా కార్పొరే



షన్ మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. నగరంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని నేటి సమాజంలో మరణించిన తన తల్లి పేరుతో రాష్ట్రస్థాయి పోటీలను రెండు రోజులపాటూ నిర్వహించేందుకు కృషిచేస్తున్న బాగ్యరెడ్డి అభినందనీ యు రాలని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలని కోరారు. నిర్వాహకులు మాట్లాడుతు ఈ పోటీల్లో గెలుపొందిన వారు కేరళలో జరిగే నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక కావటం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ పోటీలను కొరియా దేశంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 80 సంవత్సరాలకు పైబడిన వారు కూడా ఉత్సాహంగా పాల్గొనటం యువతకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. అనంతరం వాకింగ్, రన్నింగ్, షాట్ పుట్, హై జంప్, హేమర్‌త్రో, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, డిఎస్‌ఏ సిబ్బంది, పిఈటీలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు జనసేన నాయకుల చేయూత

**నెల్లూరు,డిసెంబరు10 ప్రభాతవార్త-విద్య** ద్విత్వా తుఫాను దాడికి జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జనసేన పార్టీ వీరమహిళ వాణి కుట్టుమిషన్ షాపు దెబ్బతినటంతో బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బాధితురాలికి కుట్టుమిషన్స్ కొనుగోలు నిమిత్తం అవసరమైన రూ26000 నగదును పార్టీ నాయకులు సంయుక్తంగా అందించారు.



అలాగే జనసేన పార్టీకి విశేషసేవలు అందించిన నాయకులు సైలాఫ్ తనయుడు కదలలేని స్థితిలో ఉండటంతో ఆయన కు వీల్‌చైర్ ను అందించి ఆయన వైద్యానికి అయ్యే ఖర్చుకు అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయసాధనలో భాగంగా బాధితులకు అండగా ఉండటం జరుగుతుందన్నారు. కార్యకర్తలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కోర్ కమిటి సభ్యులు నూనెమల్లికార్జునయాదవ్, రూరల్ నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, నాయకులు చదలవాడ హరీష్, గుర్రం కిషోర్‌బాబు, హేమచంద్రయాదవ్, నాగేంద్రబాలు, వర్షన్, శ్రీకాంత్,షాన్వాజ్, రాజేష్, నందిని, శాంతికళ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## శునకాలను నియంత్రించేందుకు ప్రత్యేక డ్రైవ్ : వెటర్నరి వైద్యులు

**నెల్లూరు కార్పోరేషన్,డిసెంబర్ 10 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమీషనర్ వై.ఓ.నందన్ ఆదేశాల మేరకు వెటర్నరీ వైద్యులు మదన్‌మోహన్ నేతృత్వంలో వీధుల్లో సంచరించే శునకాలను నియంత్రించే క్రమంలో భాగంగా బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక డీకేడబ్ల్యు కళాశాల, ఆత్మకూరు బస్టాండు, రేబాలవారివీధి, పడారుపల్లి, సుందరయ్యకాలనీ, జండావీధి ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌చే 10 వీధి శునకాలను పట్టుకొని పాత మున్సిపల్ కార్యాలయంలోని ఏబిసి సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ



రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని, వాటి యజమానులు సంరక్షించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయాలకు కారణం అవుతున్న రోడ్లపై తిరిగే పశువులను తప్పనిసరిగా గోశాలలకు తరలిస్తామని డాక్టర్ తెలిపారు.

## పినాకిని పార్క్‌ను సందర్శించిన కమిషనర్

**నెల్లూరు కార్పోరేషన్,డిసెంబర్ 10 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమీషనర్ వై.ఓ.నందన్ దైనందిన నగర పర్యటనలో భాగంగా రంగానాయకులపేటలోని పినాకిని పార్కును అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. పార్కుమార్గంలో జరుగుతున్న డ్రైవ్ కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ



న మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్దేశించిన సమయానికి పార్కులో అన్ని మౌళిక సదుపాయాలు, వసతులు, పచ్చదనం, మొక్కలు పెంపకం, ఆటవస్తువుల తదితర వాటిని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ రహంతుజానీ, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ పూర్తి

**కావలి, డిసెంబర్10 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశా లలను ప్రవేటీకరణ చేస్తున్నందున నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైఎ స్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ



కార్యక్రమం కా వలి నియోజకవర్గంలో పూర్తియిన సందర్భంగా వైసిపి కార్యాలయంలో స్థానిక విలేకర్ల సమావేశంలో వైసిపి నేతలు మాట్లాడారు. వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. కావలి నియోజకవర్గంలో లక్షకుపైగా సంతకాలను సేకరించి సేకరించిన సంతకాలను వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి అద్వర్యంలో ర్యాలీగా వెళ్ళి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డికి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కనుమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయుడు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షాహుల్ హామీద్, పట్టణ కార్యదర్శి నాయబ్‌రసూల్, రూరల్ మండల కన్వీనర్ వాయిల తిరుపతి, వార్డు ఇన్‌చార్జ్‌లు,టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యలపై జాయింట్ కలెక్టర్‌ను కలిసిన కల్లయ్య

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** గిరిజనులు పడుతున్న పలు సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వరరావును ఆయన కార్యాలయంలో బుధవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శిమొగిలి కల్లయ్య మర్యాదపూర్వకంగా కలసి పలు విషయాలను చర్చించడం జరిగింది. అనంతరం ఆయనను దుశ్శాలవాలతోఘనంగా సత్కరించడం జరిగింది.



## కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిమ్మ రైతులకు ఊరట

- జిల్లాలో నిమ్మ రైతులను ఆదుకునేందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి మన జిల్లాలోని నిమ్మ కొనుగోలు చేసేలా చర్యలు
- వెంటనే నిమ్మను ఆయా జిల్లాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 10, ప్రభాత వార్త** జిల్లాలో నిమ్మ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిమ్మ ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ఉద్యానవన మార్కెటింగ్ అధికారు



లతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 35000 ఎకరాల్లో నిమ్మ సాగు చేపట్టారని, ఇందులో ఈ సీజన్లో 25 వేల ఎకరాలు కాపునకు వస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో నిమ్మ విస్తీర్ణం బాగా పెరిగినందున మన ప్రాంతం నుంచి పంపించే నిమ్మకు డిమాండ్ తగ్గడంతో ధరలు కూడా తగ్గాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మన రాష్ట్రంలో నిమ్మ డిమాండ్ ఉన్న కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లకు సమావేశం నుంచే ఫోన్ చేసి మాట్లాడారు. నెల్లూరు జిల్లా నుంచి నిమ్మ పంటను ఆయా జిల్లాల్లో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరగా, ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు మన జిల్లా నుంచి నిమ్మ పంటను వెంటనే ఆయా జిల్లాలకు పంపించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డిమాండ్ ఉన్న ఇతర జిల్లాలతో కూడా సంప్రదించాలని అధికారులను ఆదేశించారు. నిమ్మ రైతులు నష్టపోకుండా వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మెడలు వంచి మెడికల్ కళాశాలలో సాధించుకుంటాం : మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి



**వెంకటాచలం డిసెంబర్ 10 తర్వాతవార్త** చంద్రబాబు నాయుడు మెడలో వంచి మె డికల్ కళాశాలను సాధించు కునే వరకు వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో తమ పోరాటం ఆగదని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి లో కోటి సంతకాల కార్యక్రమన కార్యక్రమం కోలాకలంగా జరిగింది. నియోజకవర్గ నుంచి అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు నాయకులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించి కాకాని గోవర్ధన్ రెడ్డి కాకాని పూ జితకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాకాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిచ్చిందని తెలిపారు. నిరుద్యోగ భృతి, ప్రభుత్వం అధికారంలోకి వస్తేవాలంటీర్ల జీతాలు పెంచుతామని చెప్పి చివరికి వాలంటరీ వ్యవస్థ లేకుండానే విస్మరించటం దారుణం అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల కోసం మరొకసారి జైలుకు వెళ్లే కైనా సిద్ధంగా ఉన్నామని ఎన్ని అక్రమ కేసులు బలాయించిన భయపడే ప్రసక్తే లేదన్నా. 17న రాష్ట్ర గవర్నర్ కి మెడికల్ కళాశాలను నిరసిస్తూ రాష్ట్రంలో ఉండే అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనే వైఎస్ఆర్సిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో స్వీకరించిన కోటి సంతకాల పత్రాలను గవర్నర్ అందజేయటం జరుగుతుందన్నారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కాకాని గోవర్ధన్ రెడ్డి, కాకాని పూజిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాకాని పూజిత మాట్లాడుతూ కోటమీ ప్రభుత్వం చేస్తున్నా అరాచకాలు విసిగించి ప్రజలు అధిక సంఖ్యలో కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగుతుందని నీతి మంత్రం కేసులు దోపిడీలకు పాల్పడుతున్నారు

## పొదలకూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

**నెల్లూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త - వైద్యం** ప్రజల ఆరోగ్య అవగాహనను పెంపొందించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు తరుపున డిసెంబర్ 10వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కాకతీయ డిగ్రీ కాలేజీ, పొదలకూరులో ఈ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, హెమటాలజీ, అంకాలజీ విభాగాల నిపుణుల ఉచిత కన్సల్టేషన్‌తో పాటు ఎత్తు, బరువు, జీఆర్‌బీఎస్, ఈసీజీ,పాప్స్ మియర్(స్త్రీలకు)డాక్టర్ కన్సల్టేషన్ వంటి పలు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పి.విజయ్‌కుమార్,సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్ అండ్ డయాబేటాలజిస్ట్ మాట్లాడుతూ హృదయ వ్యాధులు చాలా సార్లు లక్షణాలు కనబరచకుండానే అభివృద్ధి చెందుతాయి. అందుకే





చిన్న చిన్న మార్పులనైనా సీరియస్‌గా తీసుకుని సమయానికి పరీక్షలు చేయించుకోవాలి. ఈ శిబిరం ప్రజలకు ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించే గొప్ప అవకాశం అన్నారు. డాక్టర్ మౌనిక రెడ్డి వై, కన్సల్టెంట్ మెడికల్ అండ్ హెమాటో అంకాలజిస్ట్, బీఎం టి.ఫి జిషియన్ మాట్లాడుతూ రక్త సంబంధిత క్యాన్సర్లు, ఇతర క్యాన్సర్లు ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ఫలి తాలు చాలా మంచిగా ఉంటాయి. అలసట, రక్తహీనత, తరచూ ఇన్ఫెక్షన్లు, కారణం లేని బరువు తగ్గడ వంటి చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఇలాంటి ఉచిత శిబిరాల ప్రజల్లో అవగాహన పెంచి ప్రాణాలను కాపాడుతాయి అని పేర్కొన్నారు. అనంతరం కాకతీయ కాలేజీ విద్యార్థులకు క్యాన్సర్, పలు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్ పి.రాశిరెడ్డి, జనరల్ ఫిజిషియన్ పాల్గొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యం గురించి సమగ్రంగా తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

## విభజన వలన సర్వేపల్లి అసెంబ్లీకి నష్టం ఎక్కువ

**- కండలేరు మరో రాజోలి బండ నాగార్జున సాగర్‌ల ప్రభుత్వం వివాదస్పదం చేయొద్దు**

**నెల్లూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త -వైద్యం** మండలాల విభజన వలన జరిగే నష్టంపై సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి బీజేపీ నేతలు మిడతల రమేష్ నరాలసు బ్బారెడ్డిలు విజ్ఞప్తి చేశారు. రాపూర్ మం డలం విభజనలో కండలేరు డ్యామ్‌ను కోల్పోతాం, దాని ప్రభావం పొదలకూరు మనుబోలు మండలాలపై నష్ట ప్రభా వం ఎక్కువగా ఉంటుంది. కండలేరు డ్యామ్‌లో లెవల్ కెనాల్ మీద ఆధారపడిన



పులికల్లు వామింపర్తి. దేగపూడి ఇనుకుర్తి కొనగలురు. రామా పురం, ముదిగేడు, దేవరవేమూరు, బిరదవోలు బ్రాహ్మణపల్లి, మనుబోలు మండలంలోని రాజోలుపాడు, చెర్లోపల్లి, వీరంపల్లి, మడమానూరు, మనుబోలు, బద్వేలు, పిడూరు, పిడురుపాలెం, కొలనుకుదురు, వెంకన్నపాలెం, కటువపల్లి, బండేపల్లి, గ్రామాల రైతులు కరువు సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైలెవల్ కెనాల్ నుండి నీరు అందే గాలిపాలెం, యర్రగుంటపాలెం, మొగలూరు, కనుపర్తి, అల్లూర్తి, పొద లకూరు, తోడేరు, అయ్యగారుపాలెం, మరుపూరు, గ్రామాలు వెంకటాచల మండలంలోని పాలిచెర్లపాడు, కందలపాడు గ్రామాలలో కరువు సమయంలో నీటి ఎద్దడి తప్పనిసరిగా ఏర్పడుతుంది. నీటి లభ్యత తక్కు వగా ఉన్నప్పుడు రాయలసీమ, తెలంగాణ కాలువలకు నీరు విడుదల చేసి రాజోలు బండ డైవర్షన్ వద్ద రా యలసీమ, తెలంగాణ రైతుల పోలీసులు మోహరింపు చూస్తూనే ఉన్నాము. ఆంధ్ర- తెలంగాణాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్ పై నీటి కోసం ఇరు రాష్ట్రాల పోలీసులు ఘర్షణ పడిన విదానాన్ని చూశాం.

**ఘర్షణ పరిస్థితులు తలెత్తకుండా మండలాల విభజనను ఆపివేయాలి:** కండలేరు జలాశయ ముంపు గ్రామాల పునరావాస కేంద్రాలు పొదలకూరు నెల్లూరు రూరల్‌లో ఉన్నాయి. పునరావాస కేంద్రాల సమస్యలు 40 ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉన్నాయి. అశాస్త్రయ మండలాల విభజన వలన కండలేరు ముంపు నిరుద్యోగుల సమస్య జనులమవుతుంది. నెల్లూరు జిల్లా నుండి మండలాలు విభజన జరగకుండా ప్రభుత్వ పెద్దలకు వివరించాలని రమేష్ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.